క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు బొల్లు మల్లికార్జునరావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గాంధీనగర్ షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా కేంద్రం నిర్వాహకులు ముద్దాబత్తుని రమణయ్య, బొల్లు సుబ్బమ్మ, బొల్లు సురేష్‌బాబు, అనూష, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన 48 ఏళ్ల బత్తుల శివపార్వతి ఈ నెల 12న రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా లాభం లేకపోవడంతో భర్త శివప్రసాద్ పోలీసులను ఆశ్రయించాడు. వన్‌టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

కర్లపాలెం: అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను సెబ్ ఎస్ఐ గీతిక సీజ్ చేసి కేసు నమోదు చేసిన సంఘటన కర్లపాలెం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గీతిక తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండల పరిధిలోని మరకవారిపాలెంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి తమ సిబ్బందితో దాడులు చేపట్టారు. మట్టి తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అరెస్ట్

తెనాలిరూరల్: బలవంతంగా తమ ఇల్లు రాయించుకుని, బంగారాన్ని తీసుకున్నాడనే ఫిర్యాదుపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన మల్లవరపు జయశ్రీ, ఆమె భర్త ఆర్‌ఎంపీ క్లినిక్ నడుపుతున్నారు. మూడు నెలల క్రితం ఓ మహిళకు ఇంజక్షన్ చేయడంతో రియాక్షన్ వచ్చి పడిపోయింది. ఆమెను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఇంజక్షన్ చేయించుకున్న మహిళ మృతి చెందిందని, మృతదేహాన్ని వారి స్వగ్రామం తీసుకెళ్లారని చెప్పి జయశ్రీ దంపతులతో బంగారం కుదువ పెట్టించి నగదును 33వ వార్డు కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ తీసుకోవడమే కాకుండా తమ ఇంటిని అతని పేరున బలవంతంగా రాయించుకున్నాడంటూ జయశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు అతని కుటుంబ సభ్యులు, స్థానికులు సహకరించారని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసిన త్రీ టౌన్ పోలీసులు అహ్మద్‌తో పాటు అతని సోదరుడు ఫజల్, మరో వ్యక్తి జాన్‌సైదాను సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

గుంటూరులో దారి దోపిడీ!

పట్నంబజార్: రైలు దిగి ఇంటికి వస్తున్న ప్రయాణికుడిపై దాడి చేసి అతడి వద్ద ఉన్న వస్తువులు లాకున్ని పరారైన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. వివరాలు.. బక్రీదును పురస్కరించుకుని గుంటూరు రైలుపేటకు చెందిన సిద్ధిక్ సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి రైలు దిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పలువురు వ్యక్తులు దాడి చేసి అతని బ్యాగ్‌లోని సెల్‌ఫోన్‌లు, నగదు లాక్కుని ఉడాయించారు. దీనిపై బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. దీనిపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శారదా కాలనీ 23లో నివాసించే అడపా వెంకటేశ్వరరావు ఈ నెల 13వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. అతను కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

తాడికొండ: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు సభ్యులు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేఖ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మందడం గ్రామంలోని ఎస్టీ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వారి స్థితిగతులు తెలుసుకొని, ప్రభుత్వాధికారుల సహకారంతతో పాఠశాలలో చేర్చాలని, దీంతో వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చన్నారు.

వైఎస్సార్ సీపీ లీగల్ కమిటీ ఆవిర్భావం

పార్టీ నాయకులు, కార్యకర్తల సంక్షేమమే అజెండాగా రూపకల్పన

తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలు గెలిచిన దగ్గర్నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, దాడులు, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. బాధితులకు అండగా ఉండేందుకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ నిచ్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు పార్టీ లీగల్‌సెల్ ముందుకొచ్చింది. ఈ క్రమంలో తెనాలి నియోజకవర్గంలోనూ పార్టీ లీగల్‌సెల్ కమిటీ ఏర్పాటైంది. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ న్యాయవాదులతో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమావేశమయ్యారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గర్నుంచి పరిణామాలను చర్చించుకున్నారు. పార్టీ వర్గాలకు న్యాయ సహాయం కోసం లీగల్‌సెల్ కమిటీని నియమించారు. గత ఎన్నికల్లో తెనాలిలో చీఫ్ ఎలక్షన్ ఏజెంటుగా వ్యవహరించిన న్యాయవాది ఎస్‌బీ శివ మాట్లాడుతూ ఇప్పటికే ఇద్దరు కౌన్సిలర్లపై అక్రమ కేసులు బనాయించారనీ, భౌతికదాడులు, ప్రభుత్వ ఆస్తుల నష్టం కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు/ కార్యకర్తలకు భరోసా కల్పించటానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో నియోజకవర్గ లీగల్‌సెల్ కమిటీని నియమించినట్టు చెప్పారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ లీగల్‌సెల్ కమిటీ పార్టీ వర్గాలకు అందుబాటులో ఉంటుందని, దాడులు జరుగుతాయనే సమాచారం ముందుగా తెలిసినా, ఒకవేళ దాడులు జరిగినా వెంటనే లీగల్‌సెల్ కమిటీని సంప్రదించాలని కోరారు. వారికి పార్టీ న్యాయవాదులు అండగా ఉంటూ, రక్షణ కల్పిస్తారని వివరించారు. అనంతరం లీగల్‌సెల్ కమిటీని ప్రకటించారు.



లీగల్ కమిటీ న్యాయవాదులతో అన్నాబత్తుని శివకుమార్

న్యాయవాది	ఫోన్ నెంబరు	న్యాయవాది	ఫోన్ నెంబరు	న్యాయవాది	ఫోన్ నెంబరు
ఎస్‌బీ శివ	– 9885551111	ఎస్‌కే ఖాదర్‌హుస్సేన్	– 9848890533	గుమ్మడి రవిరాజ్	– 7569187716
కేఎం విల్సన్	– 9440238877	చీకటి రాజారావు	– 9652157346	తాడిబోయిన నాగార్జున	– 9959938939
గుంటూరు కృష్ణ	–9347656300	మైలా విజయ్‌నాయుడు	– 8885236237	నక్కా చంద్రశేఖర్	– 9490998794
బేతాళ ప్రభాకర్	9642337777	మండపాటి కోటేశ్వరరావు	– 6300233358	కొమ్ము అబ్రహాం లింకన్	– 7032233389
మేకల రవికుమార్	– 9951023777	పిల్లి సుధాకరరావు	– 9676189045	పిల్లి ప్రేమరాజు	– 9949479918
దేవరపల్లి మల్లిఖార్జునరెడ్డి	– 9966444592	తమ్మిడాల సాంబశివరావు	– 7893475667	వేజండ్ల జగజ్జీవన్‌రావు	– 6304084277

సంప్రదాయ బద్ధంగా బక్రీద్



నమాజ్ చేయిస్తున్న హాఫీజ్ ఇమ్రాన్‌బేగ్

తెనాలి: త్యాగనిరతికి, ధర్మనిబద్ధతకు ప్రతీక అయిన ఈదుల్ అజ్‌హ(బక్రీద్) పర్వదిన వేడుకలను సోమవారం పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని దాదాపు 25 మసీదుల పరిధిలోని ముస్లింలు, ముతవల్లీలు ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించారు. తలపై టోపీ పెట్టుకుని స్తోత్రాన్ని పఠించారు. పరగడుపునే చెంచుపేటలోని ఈద్‌గా మైదానం చేరుకున్నారు. అక్కడ రైల్‌పేట మసీదు ఇమామ్ హాఫీజ్ ఇమ్రాన్‌బేగ్ ఆధ్వర్యంలో నమాజ్ చేశారు. ఈదుల్ అజ్‌హా పర్వదిన నమాజ్‌ను పరగడుపునే చేయాల్సి ఉంటుంది. కొన్ని స్థానిక మసీదుల్లో ఉదయాన్నే ఈదుల్ అజ్‌హా నమాజ్ చేశారు. ఇస్లాంపేటలోని మర్కస్ మసీదులో మౌలానా అబ్దుల్లా ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటలకే నమాజ్ చేశారు. గాంధీనగర్‌లోని మస్జిద్–ఏ–ఆయేషా సిద్ధిఖాలో ముఫ్తీ ఇర్ఫాన్ ఆధ్వర్యంలోనూ, పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చారిత్రాత్మక జామియా మసీదులో హాఫీజ్ ఎండీ ఇమ్రాన్‌చే, రైస్ కాలనీలో మస్జిద్–ఏ–ఉస్మానియాలో హాఫీజ్ మొహమ్మద్ ఆలీ నేతృత్వంలో, పాండురంగపేట మక్కా మసీదులో మౌలానా ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు నమాజ్ చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈద్‌గా పక్కనే గల ముస్లిం శ్మశాన వాటికకు వెళ్లి, చనిపోయిన పెద్దల సమాధులపై పూలు చల్లి నివాళులర్పించారు. ఆర్థిక స్తోమత కలిగినవారు ఖుర్బానీని నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి విందు భోజనం ఆరగించి, రోజంతా సంతోషంగా గడిపారు.

తెనాలి రోటరీ క్లబ్‌కు గుర్తింపు



క్లబ్ పొందిన పత్రాలను చూపుతున్న సభ్యులు

తెనాలిరూరల్: తెనాలిలోని 'రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి' వైకుంఠపురంకు పలు విభాగాల్లో ప్రశంసా పత్రాలు వచ్చాయి. క్లబ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధ్యక్షుడు పావులూరు రాంబాబు వివరాలు వెల్లడించారు. క్లబ్‌లో నూతన సభ్యులను చేర్పించడం, మెటర్నిటీ, చైల్డ్ హెల్త్, విద్య, అక్షరాస్యత వంటి అనేక కార్యక్రమాలకు భద్రాచలంలో ఆదివారం జరిగిన రోటరీ క్లబ్‌ల సమావేశంలో ప్రశంసా పత్రాలను అందించినట్టు తెలిపారు. అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం..



మురుగు కాలువలో ఉన్న దోమలు

- వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- పరిశుభ్రత, దోమల నివారణే రక్షణ
- నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలి
- జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు తప్పనిసరి
- పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

తాడేపల్లిరూరల్: నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. వ్యాధుల సీజన్ మొదలైంది. దోమల దండయాత్రతో పాటు మంచి నీరు కలుషితమవుతోంది. దీంతో అనేక వ్యాధులు ప్రబలుతాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డయేరియా, మెదడువాపు లాంటి అనేక వ్యాధులు ఇబ్బంది పెడతాయి. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించకపోతే వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో నిన్నటి వరకు అధికారంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసింది. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది కొరత లేకుండా చేయడమే కాకుండా నాణ్యమైన ఔషధాలు, రక్త పరీక్షలకు ఆధునిక లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. దీంతో సీజనల్ వ్యాధులను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడానికి అధికారులకు వెసులుబాటు లభించింది.

ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరేసి డాక్టర్లు

మంగళగిరి రూరల్ పరిధిలోని ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు నియోజకవర్గంలో మొత్తం 11 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరేసి డాక్టర్లు ఉన్నారు. ఒక డాక్టరుతో సహా ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 4వ తరగతి ఉద్యోగి అందుబాటులో ఉన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, డయేరియా లాంటి అన్ని వ్యాధులకు పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్‌లలో 60 రకాలకు పైగా రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.

డెంగీ కేసులు....

నియోజకవర్గంలో డెంగీ, మలేరియా కేసులు కనిపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు మంగళగిరి నియోజకవర్గంలో డెంగీ, మలేరియా కేసులు అక్కడక్కడా నమోదయ్యాయి. వలస కార్మికులు, కూలీలు ఎక్కువగా మలేరియా జ్వరాల బారిన పడుతున్నట్లు మలేరియా శాఖ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. డెంగీ కేసుల్లో ప్రైవేటు వైద్య శాలలకు అనుబంధంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌లు, ప్రైవేటు ల్యాబ్‌లలో చేసే పరీక్షలన్నీ అనుమానాస్పద కేసులుగా వైద్యశాఖ పరిగణిస్తుంది. ర్యాపిడ్ కిట్ ద్వారా చేస్తున్న అలాంటి పరీక్షల్లో పాజిటివ్‌గా వచ్చినప్పటికీ అనుమానిత కేసుగానే పరిగణిస్తారు. ప్రభుత్వ వైద్యశాలల్లో చేసే ఎలిసా పరీక్ష ఫలితాన్నే డెంగీగా నిర్ధారిస్తారు.

దోమల నిర్మూలనే లక్ష్యంగా చర్యలు..

దోమలు ప్రధానంగా నీరు నిల్వ ఉన్న చోట పెరుగుతాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉన్న చోట దోమలు గుడ్లు పెడతాయి. అవి లార్వాగా మారతాయి. ఇవి ఇంట్లోని కూలర్లు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, టైర్లు, రుబ్బు రోళ్లు తదితర వాటిలో దోమలు పెరుగుతాయి. దోమల నివారణకు ప్రతి 15 రోజులకోసారి మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే మట్టితో పూడ్చాలి. వీలుకాని పక్షంలో పెద్ద పెద్ద కుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తారని వైద్యాధికారులు తెలిపారు. డెంగీ, మలేరియా జ్వరాలు కేవలం దోమల ద్వారా మాత్రమే సోకుతాయి. దోమలు పుట్ట కూడదు, దోమలు కుట్ట కూడదు అనే నినాదంతో ముందస్తు జాగ్రత్త చర్యలను సూచిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. శుభ్రమైన మంచినీరు మాత్రమే తాగాలి. కాచి వడపోసిన నీరు ఎంతో మేలు చేస్తుంది.

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఇవే....

సీజనల్ వ్యాధుల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, రెండు మంచినీరు కలుషితం కావడం వల్ల వచ్చే వ్యాధులు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగీ, మలేరియా, మెదవు వాపు, చికున్ గున్యా, బోధకాలు ముఖ్యమైనవి. మంచినీరు కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, డయేరియా, కామెర్లు ప్రబలుతాయి.

డెంగీ జ్వరం

ఇది ఎడిస్ ఈజిప్టి అనే దోమకాటు ద్వారా సోకుతుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్రమైన జ్వరం వస్తుంది. నొసట తలపై తల నొప్పి, కంటి లోపల కదలికలు తగ్గుట, కండరాలు, కీళ్ల నొప్పులు ఇబ్బంది పెడతాయి. నోరు ఎండిపోవడం, వాంతి వచ్చినట్లు ఉండడం, చర్మంపై కందినట్లు ఎర్రటి మచ్చలు రావడం కనిపిస్తాయి. ఈ జ్వరంలో కొందరికి ప్లేట్ లెట్లు పడిపోతాయి. ఆందోళన చెందకుండా వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలి.

టైఫాయిడ్

ఇది మంచి నీరు, ఆహారం కలుషితం కావడం ద్వారా వస్తుంది. జ్వరం వస్తూ పోతుంది. ఆకలి తగ్గుతుంది. కొంత మందిలో వాంతులు అవుతాయి. 3 రోజుల తర్వాత రక్త పరీక్షల్లో టైఫాయిడ్ పాజిటివ్ వస్తుంది. సొంత వైద్యం చేసుకోకుండా వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి.

కామెర్లు (హెపటైటిస్)

వర్షాకాలంలో ఎక్కువగా సోకే వ్యాధి పచ్చ కామెర్లు. కలుషితమైన నీరు, ఆహారం, మద్యం అలవాటు ఉన్నవారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మ క్రిములు కాలేయంలోకి ప్రవేశించడంతో కామెర్లు వస్తాయి. కామెర్లు సోకగానే కళ్లు పసుపు పచ్చగా మారుతాయి. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి తగిన వైద్య చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

డయేరియా

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్లో ప్రధానమైనవి విరేచనాలు. ఇవి కూడా కలుషితమైన ఆహారం, నీరు వల్ల వస్తాయి. విరేచనాలతో పాటుగా వాంతులు కూడా అవుతాయి. శరీరంలోని నీరంతా పోవడం వల్ల మనిషి నీరసపడిపోతాడు. ఒక్కోసారి డీ హైడ్రేషన్‌కు గురవుతారు. విరేచనాలు మొదలైన వెంటనే వీలైంతన త్వరగా సమీపంలోని వైద్యశాలకు వెళ్లాలి. అవసరమైన చికిత్స చేయించుకోవాలి. విరేచనమైన ప్రతిసారి ఎలక్ట్రాల్ తాగాలి. అవసరమైతే సెలైన్లు పెట్టి వైద్య చికిత్స చేయడం జరుగుతుంది.

ప్రభుత్వ వైద్యశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



జ్వరం, వాంతులు, విరేచనాలు వంటివి కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి. అక్కడ కన్ని రకాల వసతులు, నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫైడ్ వైద్యులు ఉన్నారు. ఎవరైనా సరే ఎలాంటి అనారోగ్య చిహ్నాలు కనిపించినా సొంత వైద్యం చేసుకోకుండా వైద్యుడిని సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– డాక్టర్ అబ్దుల్ రహమాన్, దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు.

శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

తెనాలిరూరల్: ఈ నెల 23న తెనాలిలో నిర్వహిస్తున్న శివాజీ శోభాయాత్ర బైక్ ర్యాలీ కరపత్రాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద సోమవారం శివాజీ శోభాయాత్ర స్మారక సమితి సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో నియోజకవర్గ ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని మంత్రి కోరారు. శివాజీ స్మారక సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మైలా హరికృష్ణ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరికీ తెలియాలనే ఆలోచనతో పాటు హిందూ శక్తి సంఘటితంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ శోభాయాత్ర ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెంచుపేట నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఆహ్వాన కమిటీ చైర్మన్ చందు రామారావు, ఏపూరి హరిప్రసాద్, హనుమత్ ప్రసాద్, పోలిశెట్టి సాయి, మైలా చిన్న, ఆరాధ్యుల అంకమ్మరావు, లీలా రామ్, మణికంఠ, రాచవుల రాము, మైల బాలకృష్ణ, మణి తదితరులు పాల్గొన్నారు.

సాయి లక్కరాజుకు సత్కారం



తెనాలి: ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం 17వ వార్షికోత్సవం సందర్భంగా అమెరికాలోని డల్లాస్‌లో ఆదివారం నిర్వహించిన సాహిత్య వేదిక కార్యక్రమంలో పట్టణానికి చెందిన స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత సాయి లక్కరాజు పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొని 'జనహితం–సాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం 'తానా' అంతర్జాతీయ సాహిత్యవేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, వడ్డేపల్లి కృష్ణలు సాయి లక్కరాజును శాలువతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం గ్రంథాలయానికి తాను రచించిన గ్రంథాలను సాయి లక్కరాజు అందజేశారు.

లయన్స్ క్లబ్ స్వర్ణపురి మహిళా కార్యవర్గం ఎంపిక

పొన్నూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళా నూతన కార్యవర్గ అధ్యక్షురాలిగా మన్నవ అనసూయదేవి ఎంపికయ్యారు. సోమవారం కార్యాలయంలో క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పరాశరం శేషుకుమారి, ట్రెజరర్‌గా బొద్దులూరి శబలాదేవి, సభ్యులుగా ఎ.కృష్ణకుమారి, రంగవల్లి, ఉమకుమారి, పద్మావతి, నాగ మంజరి, అమరేశ్వరి, సునీత, లక్ష్మీకుమారి, లక్ష్మీ సుభాషిణి, విజయ లక్ష్మి ఎంపికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన వేంకటేశ్వరుని సన్నిధి

వైభవంగా మొదలైన బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: చిన్న తిరుపతిగా పేరొందిన లాలాపేటలోని శ్రీపద్మావతి ఆండాళ్ సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో మొదలయ్యాయి. భక్తుల రాకతో వేకువజాము నుంచే గోవింద నామస్మరణతో దేవాలయం మార్మోగింది. ఉదయం స్వామి వారికి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు జరిగాయి. స్వామి వారిని అమ్మ వార్లను పెండ్లి కుమారునిగా, పెళ్లి కుమార్తెలుగా అలకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం విష్ణు సహస్ర పారాయణం జరగ్గా, సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణ, విశ్వేశ్వర పూజ పుణ్యావచన అఖండ దీపారాధన అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడంతో, స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీజగన్నాథ ఆంజనేయ వెంకటేశ్వర స్వామి వార్ల దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, దేవస్థానం సహాయ కమిషనర్(ఈఓ) డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు ఆర్‌టీఆర్‌వీ ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీచంద్రకుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో శ్రీస్వామి వారు, అమ్మవార్లు



విష్ణు సహస్ర పారాయణం చేస్తున్న భక్తులు

22న ఆదిశేషయ్య ఆరాధన

నగరంపాలెం: ప్రఖ్యాత డోలు విద్వాంసులు, లయబ్రహ్మ దివంగత భూసురపల్లి ఆదిశేషయ్య ఆరాధన ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై ఆరాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఆదిశేషయ్య ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఐదు సార్లు ఆయా రంగాల ప్రముఖులకు పురస్కారాలు అందజేసినట్లు వివరించారు.

శ్రీమద్భగవద్గీతపై ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో భగవద్గీతలోని జ్ఞానవిజ్ఞానయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయా మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రసంగించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

తెనాలి: ప్రతిభను ప్రోత్సహించే విధంగా ప్రతి ఏటా విద్యార్థులకు ఉపకార వేతనాలతో తోడ్పాటు నందిస్తున్న తెనాలి చిన్మయ మిషన్ సేవలు అభినందనీయమని పట్టణానికి చెందిన సంఘ సేవకురాలు, డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద అన్నారు. తెనాలి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉపకార వేతనాలను సోమవారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ సెమినార్ హాలులో అందజేశారు. డాక్టర్ శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ తరగతుల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన 14 మంది విద్యార్థులకు చిన్మయ మిషన్ ద్వారా ఉపకార వేతనాలను అందజేశారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ సేవలను డాక్టర్ శారద కొనియాడారు. డాక్టర్ శారదను చిన్మయ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదన్నది తమ ఆలోచనగా చిన్మయ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. అలపర్తి నాగరత్నమ్మ, రమాదేవి, మాధవి, రిటైర్డ్ ఎంఈవో పుష్పకుమారి, కొత్త కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్, శ్రీనివాస కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రేష్ట ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక చికిత్స

గుంటూరు మెడికల్: నగరంలోని గుజ్జనగుండ్లలో ఉన్న శ్రేష్ట ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక పద్ధతిలో ఐవీయూఎస్ విధానం ద్వారా గుండె చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండెజబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ గొట్టిపాటి నాగార్జున తెలిపారు. ఇటీవల కాలంలో యువకులు ఎక్కువ మంది గుండెజబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఎక్కువ మంది గుండె రక్త నాళాల్లో అడ్డంకులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వీటిని తొలగించడానికి యాంజియోగ్రామ్ ద్వారా స్టంట్లు అమర్చి అడ్డంకులు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. ఇంట్రా వర్క్యులర్ ఆల్ట్రా సౌండ్ (ఐవీయూఎస్) ద్వారా స్టంట్లు అమర్చడం వలన రోగులకు దీర్ఘకాలంలో మళ్లీ రక్త నాళాల్లో పూడిక ఏర్పడడానికి అవకాశాలు తక్కువ అన్నారు. స్టంట్ కూడా సరైన పరిణామంలో తగిన విధంగా కచ్చితంగా అమర్చడం జరుగుతోందని వివరించారు. దీని వలన మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. చికిత్స తమ ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు నాగార్జున వివరించారు.